సాక్షి రంగారెడ్డి

గురువారం । 18 । మే । 2023



## ఏసీబీ వలలో జేఎల్‌ఎం


విద్యుత్‌ మీటరు ఇవ్వడానికి జూనియర్‌ లైన్‌మెన్‌ (జేఎల్‌ఎం) లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. 8లో▸

## న్యూస్‌రీల్‌

### దరఖాస్తుల ఆహ్వానం

**షాద్‌నగర్‌:** ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని షాద్‌నగర్‌ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్‌ తిరుపతిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిషనర్‌ ఆఫ్‌ ఎంప్లాయిమెంట్‌ అండ్‌ ట్రెనింగ్‌ ఆదేశాల మేరకు ఆగస్టు 2023 సెషన్‌ కోసం ఎన్‌సీవీటీ ప్యాట్రన్‌ కింద వివిధ ట్రేడ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు జూన్‌ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### లయన్స్‌క్లబ్‌ పీఆర్‌ఓగా 15వ సారి పాష ఎన్నిక



**ఆమనగల్లు:** లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ ఆమనగల్లు పీఆర్‌ఓగా ఎంఏ పాష 15వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్‌ సభ్యులు నరేందర్‌రెడ్డి, మాజీ లయన్స్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ చెన్నకేశవరెడ్డి, రమేష్‌బాబు, రాంరెడ్డి కంటి వైద్యశాల చైర్మన్‌ దామోదర్‌రెడ్డి తదితరుల సమక్షంలో పాషాను పీఆర్‌ఓగా నియమించారు. 2008 నుంచి క్లబ్‌ చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా గతంలోనే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన క్లబ్‌ మెంబర్లకు పాష కృతజ్ఞతలు తెలిపారు.

### చేవెళ్ల ఆర్డీఓకు వెండి పతకం



వెండి పతకం, జాతీయ పతాకంతో వేణుమాధవ్‌రావు

**చేవెళ్ల:** సౌత్‌ కోరియాలో ఈ నెల 15, 16వ తేదీల్లో జరిగిన ఆసియా పసిఫిక్‌ మాస్టర్‌ గేమ్స్‌–2023 జూరీస్‌ తరఫున సీనియర్‌ క్యాడర్‌ ట్రిపుల్‌ జంప్‌ పోటీల్లో చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు వెండి పతకం సాధించారు. బుధవారం ఆయనకు సోషల్‌ మీడియా వేదికగా మండల అధికారులు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల ఆర్డీఓ దేశం తరఫున పోటీలో పాల్గొని పతకం సాధించారు.

### ఓయూ ఎంబీఏ గోల్డెన్‌ జూబ్లీ ఉత్సవాలు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ క్యాంపస్‌ ఎంబీఏ విభాగం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్‌ నుంచి ఏడాది పాటు గోల్డెన్‌ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్‌ ప్రొ.శ్రీరాములు తెలిపారు. బుధవారం క్యాంపస్‌లోని వర్సిటీ కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాల ఆడిటోరియంలో ఓయూ పరిధిలోని వివిధ ఎంబీఏ కాలేజీల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఏడాది పాటు జరిగే వివిధ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంబీఏ డీన్‌, హెడ్‌తో పాటు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### స్టాండింగ్‌ కమిటీ సమావేశం వాయిదా

**సాక్షి, సిటీబ్యూరో:** ఇళ్ల నుంచి చెత్త తరలింపునకు యూజర్‌ చార్జీల వసూలు, తదితర అంశాలు అజెండాతో బుధవారం జరగాల్సిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సమావేశం శుక్రవారానికి వాయిదా పడింది. చెత్త తరలించేందుకు ఒక్కో ఇంటి నుంచి కాలనీల్లో రూ.100, బస్తీల్లో రూ. 50 వసూలు చేయాలని ప్రతిపాదించారు. ఈ విషయంలో చర్చ జరగనిదే ఆమోదించవద్దని భావించారు. చార్జీలపై కొన్ని భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో స్టాండింగ్‌ కమిటీ సమావేశం వాయిదా పడటం ఊహాగానాలకు తావిస్తోంది. కమిషనర్‌కు వేరే సమావేశం ఉన్నందున, ఆయన లేకుండా నిర్వహించరాదనే తలంపుతోనే వాయిదా వేసినట్లు జీహెచ్‌ఎంసీ వర్గాలు పేర్కొన్నాయి.

### రోడ్ల తవ్వకాలపై నిషేధం

వర్షాకాలం ముగిసే వరకు..

**సాక్షి, సిటీబ్యూరో:** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రేటర్‌ పరిధిలోని అన్ని రోడ్ల తవ్వకాలపై జీహెచ్‌ఎంసీ నిషేధం విధించింది. రోడ్ల తవ్వకాలు జరిగి పనులు అసంపూర్తిగా ఉంటే వర్షాల వల్ల తీవ్రప్రమాదాలకు ఆస్కారం ఉండటంతో వర్షాకాల సన్నద్ధతలో భాగంగా అన్ని రోడ్ల తవ్వకాలపై నిషేధం విధించింది. ప్రజావసరాల కోసం వాటర్‌ బోర్డు, విద్యుత్‌, టెలికాం, తదితర ప్రభుత్వ,ప్రైవేటు విభాగాలకు కాపర్‌, ఆప్టికల్‌ ఫైబర్‌ కేబుల్స్‌, పైపులైన్ల ఏర్పాటు కోసం జీహెచ్‌ఎంసీ ఇదివరకే అనుమతులు జారీ చేసింది. అనుమతులు పొంది ఉన్నప్పటికీ, వర్షాకాలం ముగిసేంత వరకు ఎలాంటి తవ్వకాలు జరపరాదని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

# నిప్పుల కొలిమి



## వడగాలులతో గ్రేటర్‌ వాసులు సతమతం

- రోజంతా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆన్‌లోనే
- మళ్లీ పెరుగుతున్న విద్యుత్‌ డిమాండ్‌
- శివారు ప్రాంతాల్లో అనధికారిక కోతలు

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** గ్రేటర్‌ జిల్లాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. భగ్గున మండుతున్న ఎండలకు వడగాలులు తోడయ్యాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు జనం జంకుతున్నారు. ఫలితంగా నిత్యం రద్దీగా కన్పించే ప్రధాన రహదారులు మధ్యాహ్నం సమయంలో బోసిపోయి కన్పిస్తున్నాయి. గంటల తరబడి బైక్‌లపై ప్రయాణించే మార్కెటింగ్‌ ఉద్యోగులు సహా రోడ్ల వెంట చిన్న దుకాణాలు నిర్వహించే చిరు వ్యాపారులు, సిగ్నల్స్‌ వద్ద యాచకులు, ఆరు బయట ఆడుకునే చిన్నారులు వడదెబ్బకు గురవుతున్నారు. కొంత మంది స్పృహ తప్పి పడిపోతుండగా, మరికొంత మంది వాంతులు, విరేచనాలు, హైఫీవర్‌తో ఆస్పత్రుల పాలవుతున్నారు. చలువ కోసం కొబ్బరి బోండాలు, మజ్జిగ, లస్సీ వంటి శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు.

**గిర్రున విద్యుత్‌ మీటర్లు**

ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం సిటీజనులు రోజంతా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆన్‌ చేసి ఉంచుతున్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు కూడా ఏసీలను ఎక్కువగా వినియోగిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్‌ వినియోగం కొంత తగ్గినప్పటికీ.. తాజా వడగాలులకు వినియోగం మళ్లీ పైపైకి చేరుతోంది. రికార్డు స్థాయిలో విద్యుత్‌ వినియోగం అవుతుండటంతో సబ్‌స్టేషన్లలోని పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్లు, వీధుల్లోని డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఫీడర్లు ట్రిప్పై సరఫరా నిలిచిపోతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

**గ్రేటర్‌ జిల్లాల్లో విద్యుత్‌ డిమాండ్‌ ఇలా**

| తేదీ | గరిష్ట డిమాండ్‌ (మెగావాట్లలో) | మిలియన్‌ యూనిట్లు |
|---|---|---|
| 13 | 2970 | 65.4 |
| 14 | 2934 | 65.7 |
| 15 | 3247 | 69.1 |
| 16 | 3332 | 71.1 |
| 17 | 3390 | 72.5 |

**బిల్లులు రెండింతలు**

అధిక విద్యుత్‌ వినియోగం కారణంగా వినియోగదారుల నెలవారీ విద్యుత్‌ బిల్లులు మోత మోగుతున్నాయి. ప్రస్తుత డిమాండ్‌కు అదనంగా మరో వెయ్యి మెగావాట్ల డిమాండ్‌ను తట్టుకునేలా డిస్ట్రిబ్యూషన్‌ వ్యవస్థను తీర్చిదిద్దినట్లు అధికారులు చెబుతున్నారు. అధికారికంగా గ్రేటర్‌లో ఎలాంటి విద్యుత్‌ కోతలు అమలు చేయడం లేదని స్పష్టం చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలోని సరఫరా తీరు ఇందుకు విరుద్ధంగా ఉంది. కోర్‌సిటీలో పెద్దగా కోతలు లేకపోయినప్పటికీ.. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో లైన్ల పునరుద్ధరణ పనుల పేరుతో అనధికారిక కోతలు అమలవుతున్నట్లు తెలిసింది. అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు ఫోన్‌ చేసినా స్పందించడం లేదనే విమర్శలు కూడా లేకపోలేదు.



కేసీతండాలో డైట్‌ కాలేజ్‌ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో అనితారెడ్డి

# ఎడ్యుకేషన్‌ హబ్‌గా మహేశ్వరం

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

**మహేశ్వరం:** నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్‌ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మహేశ్వరంలోని కేసీతండా సమీపంలో రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన డైట్‌ కాలేజీ, రూ.1.70 కోట్లతో నిర్మిస్తున్న మోడల్‌ స్కూల్‌ మొదటి అంతస్తు భవనం, కస్తూర్బా పాఠశాలలో 2.30 కోట్లతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణానికి బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్‌ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గురుకులాల్లో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని స్పష్టంచేశారు. మహేశ్వరం మోడల్‌ స్కూల్‌కు చెందిన 9 మంది విద్యార్థులు నాసా పోటీలకు ఎంపిక కావడంపై మంత్రి కేటీఆర్‌ అభినందనలు తెలిపారన్నారు. ఉన్నత పాఠశాల, జూనియర్‌, డిగ్రీ, పాలిటెక్నిక్‌, ఐటీఐ, డైట్‌, మెడికల్‌ కాలేజీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, మోడల్‌ స్కూళ్ల ద్వారా మహేశ్వరం విద్యాభివృద్ధిలో ముందుందని తెలిపారు. ఆలయాలు, రోడ్లకు నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, జాయింట్‌ కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌, డీఈఓ సుశీంధర్‌రావు, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్‌ ఎంపీపీ సునీతానాయక్‌, కేసీతండా సర్పంచ్‌ మోతిలాల్‌నాయక్‌, ఎంఈఓ కృష్ణ, తహసీల్దార్‌ మహమూద్‌ అలీ, ఎంపీడీఓ సర్సింహ, మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపల్‌ బి.ధనుంజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

**'తొలిమెట్టు'పై అవగాహన**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య శాఖ కార్యదర్శి కరుణ, జెడ్పీ చైర్‌పర్సన్‌ అనితారెడ్డితో కలిసి అవగాహన కల్పించారు. కరోనా సమయంలో పిల్లలకు విద్యపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం తొలిమెట్టును ప్రవేశ పెట్టిందని స్పష్టంచేశారు. స్థానిక సర్పంచ్‌, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్జీఓల సహకారంతో గ్రామాల్లో వలంటీర్లను నియమించి చదువులో వెనకబడి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డితో పాటు యాదాద్రి, భువనగిరి, హైదరాబాద్‌, మేడ్చల్‌ జిల్లాల్లో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల రీడింగ్‌ రూమ్స్‌ ఏర్పాటు చేశామన్నారు.

# ప్రేమించిన యువతి దక్కలేదని యువకుడి ఆత్మహత్య

- బెదిరింపులే కారణమని మండిపాటు
- శవంతో యువతి ఇంటి ఎదుట బైఠాయింపు
- కొత్వాల్‌గూడలో ఉద్రిక్తత... భారీగా పోలీసుల మోహరింపు



ఆత్మహత్యకు పాల్పడిన శివ



కొత్వాల్‌గూడలో యువతి కుటుంబసభ్యుల నివాసం ఎదుట గుమిగూడిన స్థానికులు

**శంషాబాద్‌:** ప్రేమించిన యువతికి మరొకరితో పెళ్లి నిశ్చయం కావడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుమన్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొత్వాల్‌గూడకు చెందిన సిద్దాంతి చంద్రయ్య కుమారుడు సిద్దాంతి శివ (23) ఆటో డ్రైవర్‌. అదే బస్తీకి చెందిన యువతిని ప్రేమించాడు. ఇటీవల యువతికి వారి కుటుంబ సభ్యులు పెళ్లి నిశ్చయం చేయడంతో పాటు తాంబులాలు మార్చుకున్నారు. ఈ క్రమంలో యువతి కుటుంబ సభ్యులు మూడురోజుల కిందట శివ ఫోన్‌ను తీసుకుని అందులో ఇద్దరు కలిసి ఉన్న ఫొటోలను డిలీట్‌ చేయడంతో పాటు అమ్మాయి జోలికి రావొద్దని హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి ఆటోతో బయలుదేరిన శివ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికారు. చెన్నమ్మ హోటల్‌ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకున్నారు. కుటుంబానికి అండగా ఉన్న కుమారుడు చనిపోయాడని బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. యువతి కుటుంబ సభ్యుల బెదిరింపుల కారణంగానే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని అతడి కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**యువతి ఇంటి ముందు శవంతో బైఠాయింపు**

కాగా శివ ఆత్మహత్య ఘటన కొత్వాల్‌గూడలో ఉద్రిక్తతకు దారితీసింది. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, బస్తీవాసులు సిద్దాంతి శివ మృతదేహాన్ని యువతి ఇంటి ముందు పెట్టి బైఠాయించారు. అక్కడే గోతి తవ్వి పూడ్చివేస్తామని భీష్మించుకుని కూర్చున్నారు. యువతి కుటుంబ సభ్యులే శివ మృతికి కారణమని నినాదాలు చేశారు. దీంతో భారీ సంఖ్యలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సీఐ శ్రీనివాస్‌, ఏసీపీ భాస్కర్‌లు గ్రామానికి చేరుకుని బాధితులు, బస్తీ వాసులను సముదాయించారు. మృతదేహాన్ని తీసుకెళ్లినప్పటికీ రాత్రి 9.30 గంటలకు ఖననం చేయలేదు. శివ శరీరంపై తీవ్ర గాయాలున్నాయని, వారే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించి ఉంటారని ఆరోపించారు. న్యాయం జరిగే వరకు ఊరుకునేది లేదన్నారు. రాత్రి వరకు కూడా పోలీసులు సముదాయించినప్పటికీ కొత్వాల్‌గూడలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతూనే ఉంది.

# అవస్థల 'ఉపాధి'

- ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పనుల వద్ద కనీస వసతులు కరువు
- మండుటెండల్లోనే పనులు చేస్తున్న కూలీలు
- సకాలంలో డబ్బులు అందక అవస్థలు
- పట్టించుకోని అధికారులు

| | |
|---|---|
| జిల్లాలోని పంచాయతీలు: 558 | |
| ఉపాధి హామీ కూలీలు: 28,752 | |



బూర్గులలో ఉపాధి పని చేస్తున్న కూలీలు

**షాద్‌నగర్‌:** వలసల నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పని చేసే ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు అనేక అవస్థలు పడుతున్నారు. జాతీయ మొబైల్‌ మానిటరింగ్‌ సిస్టం ద్వారా పని చేసే ప్రదేశంలో కూలీల ఫొటోలను తీసి పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. పథకంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ప్రభుత్వం ఈ– సిస్టం ప్రవేశపెట్టింది. కానీ కూలీలు మాత్రం మండుటెండల్లోనే పనులు చేస్తున్నారు. అనేక చోట్ల వీరు సేదతీరేందుకు టెంట్లు, దప్పిక తీర్చుకునేందుకు నీళ్ల అందుబాటులో ఉండటం లేదు. వేసవి కాలంలో ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు టెంట్లు అందజేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో పనులు చేస్తుండగా కొంతమంది కూలీలు సొమ్మసిల్లి పడిపోతున్నారు. ప్రథమ చికిత్స నిమిత్తం మెడికల్‌ కిట్లు కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో దెబ్బలు తగిలితే ఆకు పసరు పెట్టుకుంటున్న దుస్థితి నెలకొంది. నీడ లేకపోవడంతో సమీపంలోని చెట్ల కింద కూర్చుని భోజనాలు చేస్తున్నారు. తాగునీటిని సైతం ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు.

**డబ్బులు రాక ఇబ్బందులు**

ఇదిలా ఉండగా ప్రభుత్వం సక్రమంగా డబ్బులు చెల్లించడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. దీంతో చిన్నపాటి అవసరాలకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోందని చెబుతున్నారు. రెండు నెలలుగా డబ్బులు రాలేదని మండిపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు కోటి రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు.

### సదుపాయాలు లేవు



పొట్టకూటి కోసం ఎండనక, వాననక కాయకష్టం చేస్తున్నాం. ఎండలు అధికంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. పని ప్రదేశంలో సరైన సదుపాయాలు కల్పించడం లేదు. అధికారులు స్పందించి టెంట్లు, తాగునీరు, మందులు అందించాలి.

– కుమ్మరి లక్ష్మి, ముట్పూరు, కొందుర్గు మండలం

### డబ్బులు రావడం లేదు



ఎండాకాలంలో ఉపాధి హామీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం సకాలంలో కూలి డబ్బులు ఇవ్వడం లేదు. రెక్కాడితే కానీ డొక్కాడని మాలాంటి పేదలకు ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లిస్తేనే అవసరాలు తీరుతాయి.

– ఇంద్రమ్మ, కాకునూరు, కేశంపేట మండలం

### జాగ్రత్తలు తీసుకోకపోతే ఎలా?



పనులు చేసే చోట అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. అవస్థల నడుమ పని చేయమంటే కూలీల సంఖ్య ఎలా పెరుగుతుంది..? అసలే ఎండలు మండిపోతున్నాయి. ఈ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఎలా..?

– శ్రీనునాయక్‌, వ్యవసాయ కార్మిక సంఘం నేత

# జీపీల్లో నిధుల్లేవ్‌!

- 11 నెలలుగా ఆగిపోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫండ్స్‌
- పంచాయతీ ఖాతాలను ఫ్రీజ్‌ చేసిన రాష్ట్ర సర్కార్‌
- ఉన్న డబ్బులు కూడా తీసుకోలేని దుస్థితి
- పేరుకుపోతున్న ట్రాక్టర్ల ఈఎంఐలు, విద్యుత్‌ బకాయిలు
- ఆందోళనలో సర్పంచ్‌లు

**షాబాద్‌:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారమై. సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నా.. సిబ్బందికి వేతనాలు చెల్లించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 11 నెలలుగా ఫండ్స్‌ నిలిచిపోయాయని దీంతో విద్యుత్‌ బిల్లులు కూడా చెల్లించలేకపోతున్నామని చెబుతున్నారు.

**అప్పులు చేసి పనులు**

జిల్లాలోని 558 మంది సర్పంచ్‌లు గతేడాది మార్చి నెలలో ఖాతాలు తీశారు. ఒక నెల నేరుగా వీరి అకౌంట్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు జమ చేసిన కేంద్రం.. ఆ తర్వాత ఆపేసింది. దీనికి తోడు స్టేట్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఫండ్స్‌ కూడా నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య, అభివృద్ధి పనులు ముందుకు కదలడం లేదు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం ఆపేయగా.. ఖాతాల్లో ఉన్న డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజ్‌ చేసింది. దీంతో సర్పంచ్‌లు దిక్కుతోచని పరిస్థితిలోఉన్నారు.

**సిబిల్‌ స్కోర్‌పై ప్రభావం**

పల్లెల అభివృద్ధి కోసం అప్పు చేసే క్రమంలో సర్పంచ్‌లు తమ వ్యక్తిగత పాన్‌, ఆధార్‌ కార్డులను బ్యాంకులకు అందించారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు నిలిచిపోవడంతో బ్యాంకుల్లో కిస్తులు చెల్లించడంలేదు. దీంతోడిఫాల్టర్‌గా ముద్ర పడుతున్న దుస్థితి నెలకొంది. ఈప్రభావం వీరి సిబిల్‌ స్కోర్‌పై పడుతోంది. ఫలితంగా వ్యక్తిగత రుణాలకు సైతం దూరమవుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో చేసిన అప్పులను తీర్చేందుకు ఆస్తులు అమ్ముకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు సర్దుబాటు చేసుకుని పనులు చేపడుతున్నా.. అకౌంట్లలో ఉన్న నిధులు ఫ్రీజ్‌ కావడంతో డ్రా చేయకలేకపోతున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందించినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రభుత్వం స్పందించి జీపీలకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.




షాబాద్‌ మండలం పెద్దవేడు గ్రామ పంచాయతీ కార్యాలయం

### ఈఎంఐలు చెల్లించడం లేదు



ట్రాక్టర్‌, ట్యాంకర్లు కొనుగోలుకు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. పంచాయతీలకు ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో బ్యాంకుల్లో ఈఎంఐలు చెల్లించడంలేదు. ఫలితంగా మా ఖాతాలు డిఫాల్ట్‌గా మారుతున్నాయి. సిబిల్‌ తగ్గడంతో వ్యక్తిగత లోన్లు కూడా ఇవ్వడం లేదు.

– శ్రీనివాస్‌గౌడ్‌ సర్పంచ్‌, మక్తగూడ

### జీతాలు ఇవ్వలేకపోతున్నాం



జీపీల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతినెలా జీతాలు చెల్లించలేకపోతున్నాం. ట్రాక్టర్‌ ఈఎంఐలు, కరెంట్‌ బిల్లులు కట్టేందుకు ఇబ్బందిగా మారింది. మూడు నెలలుగా సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. ఈ నెలాఖరు వరకైనా నిధులు విడుదల చేయాలి. ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలి.

– సుబ్రహ్మణ్యేశ్వరి, సర్పంచ్‌, షాబాద్‌

### వలంటీర్లు @ పెలికాన్‌ సిగ్నళ్లు

**కవాడిగూడ:** పాదచారులకు భద్రత కోసం సేఫ్‌ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 30 పెలికాన్‌ సిగ్నళ్లు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. దేశంలోనే తొలిసారిగా ఈ సిగ్నళ్ల వద్ద వలంటీర్లను ఏర్పాటు చేస్తూ నగర పోలీసు విభాగం చర్యలు తీసుకుంది. అప్పర్‌ ట్యాంక్‌బండ్‌లో పాల్గొన్న నగర కొత్వాల్‌ సీవీ ఆనంద్‌ అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నల్‌ను ప్రారంభించారు. పాదచారుల భద్రతతో పాటు వాళ్లు ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటకుండా నిరోధించడం ద్వారా వాహన చోదకులకూ ఇవి ఉపయుక్తమని ఆయన వ్యాఖ్యానించారు. ఫలితంగా అటు పాదచారులు, ఇటు వాహనచోదకుల భద్రత పెరుగుతుందని తెలిపారు.



# వీఓఏల డిమాండ్లు తీర్చాలి

సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య



దీక్ష చేస్తున్న వీఓఏలు

కడ్తాల్: ఇందిరా క్రాంతి పథంలో పనిచేస్తున్న వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే తీర్చాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కందికంటి లావణ్య ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారానికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. వీఓఏలుగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో గ్రామ స్థాయిలో మహిళల అభ్యున్నతికి ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి, ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామన్నారు. సర్వేలు, ఆన్‌లైన్ పనులు అంటూ పనిభారం పెంచుతూ తగిన వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు జానకీరాములు, కార్యదర్శి వనిత, కోశాధికారి జంగయ్య తదితరులు ఉన్నారు.



## యువతి అదృశ్యం



కావ్య(ఫైల్)

మొయినాబాద్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ శివారెడ్డి తెలిపిన వివరాలు.. పెద్దమంగళారం గ్రామానికి చెందిన బీ సుభాన్‌రెడ్డి రెండో కూతురు కావ్య(20) మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ఈతకు వెళ్లి వ్యక్తి గల్లంతు

షాద్‌నగర్: ఈతకు వెళ్లిన వ్యక్తి చెరువులో దిగి గల్లంతైన ఘటన బుధవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కంసాన్‌పల్లికి చెందిన సాయిలు(40) కొడుకుతో కలిసి గ్రామ శివారులోని చెరువులో ఈత కొట్టడానికి వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. అక్కడ ఉన్న వారు విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. బంధువులు చెరువులో సాయిలు కోసం వెతికారు. కానీ ఆచూకీ కనిపించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపు ఆపేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లారీ డ్రైవర్‌కు రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టి నలుగురి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి మద్యం సేవించి తుర్కయంజాల్ కూడలి వద్ద రోడ్డుపై నిలిపిన డీసీఎంను ఢీకొట్టడంతో నలుగురు చనిపోయిన విషయం తెలిసిందే. ఇందుకు కారణమైన నర్కుట్‌పల్లికి చెందిన లారీ డ్రైవర్ రవీందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# ఏసీబీ వలలో జేఎల్‌ఎం

- విద్యుత్ మీటర్ ఇవ్వడానికి రూ. 15వేల లంచం డిమాండ్
- ముందుగా రూ. 10వేలు..
- మరో రూ. 5 వేలు తీసుకుంటూ చిక్కిన జేఎల్‌ఎం



మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

మొయినాబాద్: విద్యుత్ మీటరు ఇవ్వడానికి జూనియర్ లైన్‌మెన్(జేఎల్‌ఎం) లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. మొయినాబాద్ మండలం బాకారంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ వ్యక్తి బాకారం గ్రామంలో రెండు ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన ప్రతాప్‌ను సూపర్‌వైజర్‌గా నియమించి పొలం పనులు చూసుకుంటున్నాడు. ఆ భూమిలో ఓ గది నిర్మించారు. విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేయగా మీటరు మంజూరైంది. బాకారం జూనియర్ లైన్‌మెన్ వీరకర్ణ మీటర్ ఇవ్వడానికి లంచం డిమాండ్ చేశాడు. దీంతో ప్రతాప్ మార్చి నెలలో రూ. 10 వేలు ఇచ్చాడు. అయినా కనెక్షన్ ఇవ్వలేదు. మీటర్ ఇవ్వాలంటే మరో రూ. 5వేలు కావాలని జేఎల్‌ఎం డిమాండ్ చేశారు. దీంతో ప్రతాప్ అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు బుధవారం రూ. 5వేలు ఇస్తానని.. తన వ్యవసాయ క్షేత్రం వద్దకు రావాలని ప్రతాప్.. జూనియర్ లైన్‌మెన్‌కు చెప్పాడు. మధ్యాహ్నం 12గంటల సమయంలో జేఎల్‌ఎం వీరకర్ణ వ్యవసాయ క్షేత్రానికి వచ్చి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 5వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరకర్ణను అదుపులోకి తీసుకుని మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తరలించారు. సుమారు 4 గంటలపాటు సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ, నలుగురు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. గురువారం నిందితున్ని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

**జోరుగా అవినీతి**

విద్యుత్ శాఖలో అవినీతి బాగోతం జోరుగా సాగుతోంది. ఇబ్రహీంబాగ్ డివిజన్‌లో కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ దాడులు జరుగుతున్నా వారికి ఏమాత్రం భయం లేకుండా పోయింది. ఈ డివిజన్ పరిధిలో రియల్ ఎస్టేట్, టవర్స్ కంస్ట్రక్షన్, విల్లాల నిర్మాణం, ఫాంహౌస్‌ల ఏర్పాటు జోరుగా సాగుతుండడంతో విద్యుత్ కనెక్షన్లకు డిమాండ్ పెరిగింది. దీన్ని అదనుగా చేసుకుని విద్యుత్ అధికారులు, సిబ్బంది భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. ఒక్కో కనెక్షన్‌కు రూ. లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో మొయినాబాద్ మండలంలో పనిచేసిన ఆ శాఖ ఏఈ భారీగా అవినీతికి పాల్పడి సస్పెండ్ అయ్యారు. తాజాగా జేఎల్‌ఎం ఏసీబీకి చిక్కాడు. ఈ డివిజన్‌లో జరుగుతున్న అవినీతిపై గతంలో కొందరు విద్యుత్ సౌధాలో సైతం ఫిర్యాదు చేశారు. అయినా అవినీతి ఆగడంలేదు. తాజాగా జరిగిన ఏసీబీ దాడితోనైనా విద్యుత్ అధికారులు, సిబ్బంది దారికొస్తారో లేదో వేచిచూడాలి.

## తరుగు పేరిట దోపిడీ

కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధర్నా

యాచారం: మంతన్‌గౌరెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తరుగు పేరుతో తమ రెక్కల కష్టాన్ని దోచుకుంటున్నారని రైతులు మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులు 40 కిలోల బస్తాకే 4కిలోల తరుగు పేరుతో ధాన్యాన్ని అధికంగా నింపుతున్నారని, ఇదేమని అడిగితే మీ ఇష్టం ఉంటే అమ్మండి.. లేదంటే వెళ్లిపోండి అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆందోళన చేపట్టారు. రైతుల ఆందోళనకు మద్దతుగా కాంగ్రెస్, సీపీఎం పార్టీలు మద్దతు ప్రకటించి ధర్నాలలో పాల్గొన్నారు. అధికారులు వచ్చే వరకు ధాన్యం కొనుగోళ్లు నిలిపేయాలని రైతులు మొండికేశారు. ఇప్పటికే గ్రామంలో వందలాది క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ముంచారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి మంతన్‌గౌరెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతినాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదయ్యగౌడ్‌లతో కలిసి రైతులతో మాట్లాడి ఇక నుంచి బస్తా తూకం మేరకు తరుగు ఉంటుందని, రైతులు ఆందోళన చెందవద్దని సర్ది చెప్పారు. దీంతో రైతులు శాంతించి కొనుగోళ్లకు సహకరించారు.

## చెరువు పరిరక్షణకు న్యాయపోరాటం



చెరువును రక్షించాలంటూ నినాదాలు చేస్తున్న సంఘం సభ్యులు

ఆల్ ఇండియా న్యాయవాదుల సంఘం

తుర్కయంజాల్: మాసబ్ చెరువు సుందరీకరణకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసినా.. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల చెరువు అన్యాక్రాంతం అవుతోందని ఆల్ ఇండియా న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, బార్ కౌన్సిల్ మెంబర్ కే సత్యనారాయణ తెలిపారు. న్యాయవాదుల బృందం బుధవారం చెరువు పరిరక్షణ సమితి, అఖిల పక్ష నాయకులతో కలిసి మాసబ్ చెరువులో మట్టిని డంప్ చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోర్టు ఉత్తర్వులను పక్కతోవ పట్టిస్తూ, ఎవరు కూడా అందులో కల్పించుకోవద్దని ఉందనే దాన్ని బూచిగా చూపి అన్ని శాఖల అధికారులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. చెరువు పరిరక్షణకు న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు. అవినీతి అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, అరుణ్‌కుమార్, రమావత్ కళ్యాణ్‌నాయక్, వీరేశం, బాబు తదితరులు పాల్గొన్నారు.

## సంఘం భూమిని ఆక్రమిస్తే చర్యలు

చేనేత, ఉన్ని, జౌళి శాఖ హైదరాబాద్ ప్రాంతీయ ఉప సంచాలకులు వెంకటేశం



చేవెళ్లలోని ఉన్ని పరిశ్రమను సందర్శించిన వెంకటేశం, ఇందిర తదితరులు

చేవెళ్ల: పట్టణంలోని ఉన్ని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘానికి సంబంధించిన భూమిని కొందరు ఆక్రమించారని, దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని చేనేత, ఉన్ని, జౌళి శాఖ హైదరాబాద్ ప్రాంతీయ ఉప సంచాలకులు వెంకటేశం తెలిపారు. బుధవారం ఆయన చేవెళ్లలోని ఉన్ని చేనేత పరిశ్రమను సహాయ అధికారి వి.ఇందిరతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. చేవెళ్లలోని సర్వే నంబర్ 3లో ఉన్ని చేనేత సహకార సంఘానికి ప్రభుత్వం 2 ఎకరాల 10 గుంటల భూమి కేటాయించిందని తెలిపారు. ఇక్కడే పరిశ్రమ కొనసాగుతోందని చెప్పారు. అయితే ఈ స్థలానికి చుట్టూ కంచె లేకపోవడంతో కొందరు నాయకులు, ప్రజలు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ఈ భూమిపై అన్ని హక్కులు ఉన్ని సంఘానికే ఉన్నాయన్నారు. పలుమార్లు సర్వే చేయించి హద్దులు నిర్ణయించినా ఈ భూమిలోకి అక్రమంగా చొరబడి ఇళ్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో ఈ స్థలం చుట్టూ కంచె వేస్తామన్నారు. చేనేత, ఉన్ని కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉన్ని సహకార సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, కార్యదర్శులు సత్తయ్య, మాణిక్యం, మల్లయ్య, రాంచందర్, సభ్యులు వెంకటయ్య, కిష్టయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.



## యువకుడిపై రౌడీషీట్

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని బాటాసింగారం గ్రామానికి చెందిన ఎం సాయి కార్తీక్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సాయి కార్తీక్‌పై ఇప్పటికే ఐదు కేసులు నమోదు కాగా.. తాజాగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నట్లు మరో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసులు కార్తీక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విధితమే. కార్తీక్‌పై 2019లో రేప్ కేసు, 2022లో దోపిడీ, ఇంట్లోకి చొరబడిన కేసు, ఈ ఏడాది దాడి చేసిన ఘటనపై కేసులు నమోదయ్యాయి. తాజాగా ఇద్దరు బాలికలను ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జైలులో ఉన్న కార్తీక్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో వనస్థలిపురం ఏసీపీ ఆదేశాలతో సాయి కార్తీక్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ తెలిపారు.

## ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ రంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ ఫౌండేషన్ కోర్సు ఒకటవ బ్యాచ్ ఐదు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 17 నుంచి వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 21వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బషీర్‌బాగ్ నిజాం కాలేజీలో నిర్వహించే అర్హత పరీక్షకు హాజరుకావాలని కోరారు .

## గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



కందుకూరు: చల్లా నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- రెండోసారి నియమితులైన సందర్భంగా పలువురి శుభాకాంక్షలు

మీర్‌పేట: రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి బుధవారం తెలిపారు. డీసీసీ అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన సందర్భంగా ఆయన మాట్లాడారు.. తనపై మరింత బాధ్యత పెరిగిందని, కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం కార్యకర్తలు, నాయకులతో కలిసి పోరాటం చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

**శుభాకాంక్షలు**

కందుకూరు: డీసీసీ అధ్యక్షుడిగా రెండో సారి నియమితులైన చల్లా నర్సింహారెడ్డికి ఆ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పార్టీ మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎండీ అఫ్జల్‌బేగ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు పాండురంగారెడ్డి తదితరులు చల్లాను పార్టీ కార్యాలయంలో కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకునే వరకు విశ్రమించేదిలేదని ఈ సందర్భంగా చల్లా తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఖాజా మొయినుద్దీన్, నాయకులు సభావత్, గణేష్‌నాయక్, బాబు, వెంకటేష్, రాములు, ముత్యంరెడ్డి, జగన్, దర్శన్, రాజేందర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రభు, నయీమ్, మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కేసీఆర్ విఫలం

- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- రేపు షాద్‌నగర్‌కు కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ రాక
- బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల హామీలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ ఘోరంగా విఫలమయ్యారని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ డీ పవన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ టీ విజయ్‌కుమార్ అధ్యక్షతన పార్లమెంట్ ప్రవాస్ యోజన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులకు కేంద్ర పథకాలు అందేలా చూడాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నేతలు పూర్తి సమయాన్ని కేటాయించి పార్టీకి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫమయ్యారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 19న షాద్‌నగర్‌కు కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే వస్తున్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో మేథావులతో నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, ఏ బాబయ్య, పీ విష్ణువర్ధన్‌రెడ్డి, డీ అశోక్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వంశీకృష్ణ, ఎం మురళీ, సాయిబాబ, వెంకటేష్, నర్సింలు యాదవ్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.